# వయసుతో పాటు పెరుగుతున్న కీళ్ల సమస్యలు

## (12 అక్టోబర్ "ప్రపంచ ఆర్థరైటిస్ దినం" సందర్భంగా)

కీళ్ళ వాపులు, మస్క్యులోస్కెలిటల్ రుగ్మతలకు సంబంధించిన వ్యాధులను ఆర్థరైటిస్ అంటాం. కీళ్ళవాపు వ్యాధితో కీళ్ళనొప్పులు, కదలికలు తగ్గడం, కీళ్ళు కదలకుండా దృఢంగా మారడం వంటి పలు సమస్యలు ఉత్పన్నం అవుతాయి. అన్ని వయస్సుల జనంలో కనిపించే ఆర్థరైటిస్ రోగ తీవ్రత, వాటిలో రకాన్ని బట్టి చికిత్స పద్ధతులు నిర్ణయించబడుతాయి. సర్వసాధారణ ఆర్థరైటిస్ రోగాలలో ఆస్టియోఆర్థరైటిస్, రిమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్ (వేళ్ళ దగ్గర పుండు), లూపస్ (చర్మవృక్క వికార రోగం) ముఖ్యమైనవి. కీళ్ళవాపు వ్యాధితో శరీర కదలికల్లో మార్పు, పనులు సక్రమంగా చేయలేక పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థుల్లో నడక, సైక్లింగ్, ఈత లాంటి భౌతిక క్రియలు కష్టమైనప్పటికీ, వాటితోనే కొంత ఉపశమనం కూడా కలుగుతుంది. శరీర బరువు తగ్గడంతో మోకాళ్లపై భారం తగ్గిపోయి కీళ్ళ నొప్పులు కూడా తగ్గుతాయి.

### ప్రపంచ ఆర్థరైటిస్ దినం-2025 నినాదం:

రుమాటిక్ అండ్ మస్క్యులోస్కెలిటల్ వ్యాధుల (ఆర్థరైటిస్ వ్యాధుల) పట్ల ప్రజల్లో అవగాహన, జీవనశైలిలో మార్పులు, తొలి దశలోనే గుర్తించడం, కీళ్ళనొప్పులతో బాధపడే వారు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆర్థరైటిస్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేయటానికి ప్రతియేటా 12 అక్టోబర్ రోజున 'ప్రపంచ కీళ్ళవాపు లేదా ఆర్థరైటిస్ దినం" జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 1996లో అంతర్జాతీయ ఆర్థరైటిస్, రుమటిజమ్ సంస్థ నేతృత్వంలో ప్రపంచ ఆర్థరైటిస్ దినం ప్రవేశ పెట్టబడింది. ప్రపంచ ఆర్థరైటిస్ దినం-2025 నినాదంగా 'కలలను సాకారం చేసుకొండి (అచీవ్ యువర్ డ్రీమ్స్)' అనే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. తొలి దశలో (12 వారాల లోపు) గుర్తించిన వారికి సులభంగా నియంత్రించబడే ఆర్థరైటిస్, ఆలస్యంగా గమనించిన వారిలో తీవ్ర వ్యాధిగా మారి శరీరక శ్రమ చేయలేకపోవడం, దినచర్యలో క్రియాశీలత క్షీణించడం లాంటి పరిణామాలకు దారితీస్తుంది. అనువంశికంగా కూడా సంక్రమించగల ఆర్థరైటిస్ వ్యాధి పొగ త్రాగడం, స్థూలకాయం, నిష్క్రియాత్మక జీవనశైలి, కీళ్ళ/కండరాలపై పని ఒత్తిడి, ప్రమాదాలు లాంటి కారణాలతో కీళ్ళ వాపు వ్యాధి తీవ్రత (ఆర్థరైటిస్) పెరుగుతుంది.

### ప్రపంచ సమస్యగా ఆర్థరైటిస్:

ప్రపంచవ్యాప్తంగా 350 మిలియన్ల ప్రజలు ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. దాదాపు విశ్వ జనాభాలో ఒక శాతం ప్రజలు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో సతమతం అవుతున్నారు. వయస్సు 60 ఏళ్ళు దాటిన మహిళల్లో 18 శాతం, పురుషుల్లో 10 శాతం ప్రజలు ఆస్టియోఆర్థరైటిస్‌తో బాధ పడుతున్నారు. ఇండియాలో 15 శాతం ప్రజలకు (180 మిలియన్లు) కీళ్ళవాపు సమస్యలు ఉన్నాయి. ఆరోగ్యకర జీవనశైలి (పొగ తాగక పోవడం, మానసిక ఒత్తిడి తగ్గించడం, చక్కగా నిద్ర పోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం), ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు (సమతుల పోషకాహారం, ఉప్పు మరియు చక్కెరను తగ్గించడం), వైద్యులు లేదా ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు శారీరక శ్రమ (సైక్లింగ్, వాకింగ్, గార్డెనింగ్, స్విమ్మింగ్, యోగా వంటివి) పాటించడం ద్వారా ఆర్థరైటిస్ అదుపు చేయపడుతుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వయసుతో ప్రమేయం లేకుండా రావచ్చేమో కాని వయస్సుతో పాటు వచ్చే అవకాశం ఆస్టియోఆర్థరైటిస్‌కు ఉంటుంది. ఆస్టియోఆర్థరైటిస్ అదుపు చేయడానికి నీటిని ఎక్కువగా తాగడం(2 లీటర్ల కన్న ఎక్కువ), నూనెలు/కొవ్వులను తగ్గించడం, స్వీట్స్ మరియు సాఫ్ట్ డ్రింక్స్ తగ్గించడం, పోషకాహారం తీసుకోవడం, నిపుణుల సూచనలతో శారీరక వ్యాయామం చేయడం లాంటివి పాటించాలి.

### రుమటాయిడ్ ఆర్థరైటిస్:

రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనబడే దీర్ఘకాలిక రుగ్మత కారణంగా చర్మం, కళ్ళు, ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలతో పాటు రోగనిరోధకశక్తిని ప్రభావితం చేస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ తీవ్రతతో ఎముకల క్షయం మరియు కీళ్ళ వైకల్యంతో పాటు వాపుతో తీవ్రమైన నొప్పి వస్తుంది. వయసు, లింగం, అనువంశికత, పొగ తాగడం, పర్యావరణ కాలుష్యం, అధిక బరువు కారణాలతో రుమటాయిడ్ ఆర్థరైటిస్ రావచ్చు. ఈ వ్యాధి ఫలితంగా పొడి కళ్ళు / నోరు, అసాధారణ శరీర కూర్పు, కీళ్ళ వాపు, కీళ్ళ దృఢత్వం తగ్గడం, మూత్రపిండాలు, లాలాజల గ్రంథులు, నరాల కణజాలం, ఎముకన మజ్జ, నోడ్యూల్స్, గుండె సమస్యలు, ఊపిరితిత్తుల జబ్బులు, కార్పాల్ టన్నెల్ సిండ్రోమ్ రుగ్మతలు కలుగుతాయి. దీనిని తగ్గించడానికి వేడి లేదా చల్లని ప్యాక్స్, తగినంత విశ్రాంతి, వ్యాయామం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులు ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, చేపలు, సోయా గింజలు, అవిసెలు, ఆక్రోట్లు, విటమిన్- ఏ, సి, ఈ కలిగిన ఆహారం, బెర్రీస్, చాక్లెట్స్, పాలకూర, బీన్స్, తాజా పండ్లు, అల్లం, ఫిష్ ఆయిల్, తాజా కూరగాయలు, ఫైబర్ ఫుడ్, బ్రోకోలీ, గ్రీన్ టీ, ద్రాక్ష లాంటి పోషకాహారం తీసుకోవాలి.

కీళ్ళ వాపు సమస్యలు రాకుండా ఉండేలా జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ, వైద్యుల సూచన మేరకు పోషకాహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.

ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులు వైద్య నిపుణుల సూచనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధిని నియంత్రించాలి. చికిత్స కన్న నివారణే మిన్న అని ముందు జగ్రత్త పడుతూ, సంతోషదాయక జీవనయానం చేద్దాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# స్వచ్ఛతా హీ సేవా 2025 ప్రచారాన్ని విజయవంతంగా పూర్తిచేసిన సమాచార, ప్రసారం మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: స్వచ్ఛత హీ సేవా 2025 కార్యక్రమాన్ని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2,వరకు సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రచారంలో భాగంగా 2,766 కార్యక్రమాలు నిర్వహించగా..వీటిలో స్వచ్ఛతా టార్గెట్ యూనిట్ల శుభ్రపరిచే కార్యక్రమాలు, ఇంటింటా అవగాహన, స్వచ్ఛత ర్యాలీలు, చిత్రలేఖన పోటీలు, కవితా పఠనం, నుక్కడ్ నాటక్, నినాదాల రచనలు వంటి సాంస్కృతిక ప్రదర్శనల కార్యక్రమాలు ఉన్నాయి. ఈ కార్యక్రమాల్లో 59,122 మంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా 2025 ప్రచారం ద్వారా మొత్తం 1588 ప్రదేశాలను శుభ్రం చేయగా మొత్తం 824 సీటీయూలను మార్చారు. 198 అడ్వకసీ ఫర్ స్వచ్ఛతా, 49 క్లీన్ గ్రీన్ ఉత్సవ్, 107 సఫాయిమిత్ర సురక్షా శిబిరాల కింద కార్యక్రమాలు నిర్వహించారు.

సెప్టెంబర్ 25న 'ఏక్ దిన్ ఏక్ ఘంటా ఏక్ సాథ్', అక్టోబర్ 2న 'స్వచ్ఛ భారత్ దివస్' సందర్భంగా మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది స్వచ్ఛత కోసం చీపుర్లు పట్టుకుని రోడ్లపైకి వచ్చారు.

సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ప్రచారానికి ముందు, అమలు దశలో అన్ని మీడియా సంస్థల అధిపతులు, నోడల్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అలాగే ప్రచార కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

న్యూఢిల్లీలోని ప్రధాన కార్యాలయం శాస్త్రి భవన్‌లో సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ కార్యదర్శి సంజయ్ జాజు నాయకత్వంలో 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్' కార్యక్రమం నిర్వహించారు. మంత్రిత్వ శాఖ మీడియా యూనిట్లలోని అధికారులు మరియు సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా ప్రచారంలో చురుకుగా పాల్గొనేలా ప్రేరేపించారు.

ఆయన మంత్రిత్వశాఖ మీడియా అధికారులు, సిబ్బందిని స్వచ్ఛతా కార్యక్రమాల్లో చురుకుగా ఎ ా ల గ ్లా న ే ల ా ప్రేరేపించారు.దేశవ్యాప్తంగా వివిధ మీడియా యూనిట్లు, అనుబంధ సంస్థలు శుభ్రతా,అవగాహన కార్యకలాపాలను కూడా చేపట్టాయి.

ఐఐఎంసీ అమరావతి స్వచ్ఛతా ర్యాలీని నిర్వహించగా, డీపీడీ అధికారులు న్యూఢిల్లీలో విధుల్లో శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. డీడీకే ముంబై దాదర్ బీచ్ వద్ద శుభ్రతా కార్యక్రమంతోపాటు ఆకాశవాణి అవేధి, ఆకాశవాణి ఇంఫాల్, ఎన్ఎఫ్‌డీసీ ముంబై, ఇతర మీడియా యూనిట్లలో శుభ్రత, అవగాహన కార్యక్రమాలను చేపట్టాయి. ఐఐఎంసీ కొట్టాయంతమ క్యాంపస్ ప్రవేశద్వారం వద్ద పరిశుభ్రత, సంస్కృతి, స్థిరత్వానికి నివాళిగా సహజ పూలతో రంగురంగుల రంగవల్లిని రూపొందించి స్వచ్ఛతా హీ సేవాను నిర్వహించింది.

సీబీఎఫ్‌సీ ఢిల్లీలో పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో స్వచ్ఛతా ర్యాలీ, ఐఐఎంసీ ఢిల్లీలో ఇంటింటికి అవగాహన ప్రచారం, డీడీకే పాట్నాలో వీధి నాటకం, ఏఐఆర్-అహ్మదాబాద్‌లో శుభ్రతా ఉత్సవం, డీడీకే నిర్వహించిన ఆరోగ్య శిబిరం కార్యక్రమాలు ఉన్నాయి. ఈ కార్యకలాపాలకు ప్రింట్, డిజిటల్, సామాజిక మాధ్యమాల ద్వారావిస్తృత ప్రచారం కల్పించడం, ప్రజల్లో అవగాహన పెంచి, ప్రచారంలో పాల్గొనేలా మంత్రిత్వ శాఖ ప్రోత్సహించింది.

# న్యూఢిల్లీలో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన సుమారు రూ. 1816 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపనలు చేసిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా న్యూఢిల్లీలో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన సుమారు రూ. 1816 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఈ రోజు ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా, అనేక మంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దీపావళి, ఛఠ్ పూజ సందర్భంగా ఢిల్లీ ప్రజలకు కేంద్ర హోం, సహకార మంత్రి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

ఇటీవలే శ్రీ నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 24 సంవత్సరాల నిరంతర ప్రజా సేవను పూర్తి చేసుకున్నారని కేంద్ర హోంమంత్రి తన ప్రసంగంలో తెలిపారు. ఒక ప్రధాన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా.. తరువాత గొప్పనైన భారతదేశానికి ప్రధానమంత్రిగా.. 24 సంవత్సరాల పాటు దేశానికి సేవ చేసిన దేశంలోనే తొలి వ్యక్తి మన ప్రధానమంత్రి శ్రీ మోదీ అని ఆయన కొనియాడారు. ఈ 24 సంవత్సరాల్లో ప్రధానమంత్రి మన స్వాతంత్ర్య సమరయోధుల కలలను నెరవేర్చ దానికి అనేక కొత్త కార్యక్రమాలను ప్రారంభించారని ఆయన అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సుపరిపాలనను సుసాధ్యం చేశారని ఆయన స్పష్టం చేశారు. 2047లో భారత స్వాతంత్ర్య శతాబ్ది నాటికి దేశాన్ని సురక్షితంగా మార్చడం, ఆర్థిక వ్యవస్థను పురోగమనంలో నడిపించ డం, ప్రతి రంగంలో దేశాన్ని అగ్రగామిగా చేసేందుకు ప్రధాన మంత్రి సంకల్పించారని శ్రీ అమిత్ షా తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ మోదీ పుట్టినరోజున సేవా పఖ్వాడా ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో రూ. 1700 కోట్లకు పైగా విలువైన 17 ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపనలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. ఈరోజు సేవా పఖ్వాడ ముగింపు సందర్భంగానూ రూ. 1800 కోట్ల వ్యయంతో చేపట్టిన 11 ప్రాజెక్టులను ప్రారంభించి, 8 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభించిన ప్రాజెక్టుల్లో దాదాపు 80 శాతం యమునా నదిని శుభ్రం చేసే ప్రయత్నాలతో ముడిపడి ఉన్నందున ఈ రోజు జరిగిన కార్యక్రమానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు. ఢిల్లీ ప్రజలు మార్పును ఎంచుకున్నప్పుడు.. తల్లి యమునా నదిని శుద్ధి చేయడం తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని ప్రధానమంత్రి శ్రీ మోదీ ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. 2029 నాటికి యమునా నదిని శుభ్రపరిచే పని పూర్తి చేస్తామని ప్రధానమంత్రి మోదీ హామీ ఇచ్చారన్నారు. కేవలం అవినీతిని తగ్గించడం, ప్రకటనలపై తక్కువ ఖర్చు చేయడం వంటి వాటి ద్వారా యమునా నది శుద్ధిని సాధించవచ్చని తెలిపారు. స్వచ్ఛ యమునా కల సాకారం కోసం మార్గం సుగమం అయిందని కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి శ్రీ మోదీ నాయకత్వంలో రాబోయే ఏడు నెలల్లో ప్రయాగ్‌రాజ్ వరకు యమునా నదిని శుభ్రం చేసే ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. గత ప్రభుత్వం యమునా నదిని శుభ్రం చేసి అందులో స్నానం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ వారు ఆ పని చేయలేదని, అందుకే ఢిల్లీ ప్రజలు వారిని మునిగిపోయేలా చేశారని శ్రీ అమిత్ షా అన్నారు.

యమునా నదిని శుద్ధి చేయాలనే ప్రధానమంత్రి శ్రీ మోదీ సంకల్పం రాజకీయ చర్య కాదని.. మన ప్రజల హృదయాల్లో పవిత్ర స్థానంగా ఉన్న యమునా నదిని గౌరవించే కార్యక్రమం అని కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో వరుసగా 15 సంవత్సరాలు, 11 సంవత్సరాలు అధికారంలో ఉన్న మునుపటి ప్రభుత్వాల పాలనలో ఢిల్లీ ప్రజలు అభివృద్ధికి దూరమయ్యారని విమర్శించారు. ప్రస్తుతం మన ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లోనే మన జాతీయ రాజధాని అభివృద్ధి పరంగా ప్రపంచ ప్రసిద్ధి చెందాలనే సంకల్పంతో పనిచేస్తోందని శ్రీ షా తెలిపారు.

నవరాత్రి మొదటి రోజునే ప్రధానమంత్రి శ్రీ మోదీ 395కు పైగా వస్తువులపై జీఎస్టీ రేట్లను తగ్గించారన్నారు. అనేక వస్తువులపై జీఎస్టీని సున్నాకు, కేవలం 5 శాతానికీ తగ్గించారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రూ. 12 లక్షల వరకు ఆదాయాన్ని పన్ను రహితం చేశారనీ ఆయన గుర్తుచేశారు. ఈ రెండు కార్యక్రమాలను కలిపి చూస్తే ప్రజలకు దాదాపు రూ. 2.5 లక్షల కోట్లు ఆదా అయినట్లు కేంద్ర హోంమంత్రి తెలిపారు. దేశ ప్రజలు వరుసగా మూడోసారి శ్రీ నరేంద్ర మోదీని ప్రధానమంత్రిగా ఎన్నుకోవడం వల్లే ఈ పరివర్తన సాధ్యమైందన్నారు.

ఢిల్లీలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి వారంలోనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేశామని శ్రీ అమిత్ షా తెలిపారు. గత ప్రభుత్వం తెరిచిన 57 మొహల్లా క్లినిక్‌లలో గ్లూకోమీటర్లు కూడా లేవు.. 45 క్లినిక్‌లలో ఎక్స్-రే యంత్రాలూ లేవు.. 21 క్లినిక్‌లలో పల్స్ తనిఖీ చేసే సౌకర్యాలు లేవు.. 38 క్లినిక్‌లలో కనీసం థర్మామీటర్లు కూడా లేవని ఆయన విమర్శించారు. అటువంటి మొహల్లా క్లినిక్‌లలో చికిత్స సాధ్యం కాదన్నారు. 11 సంవత్సరాలు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం మొహల్లా క్లినిక్‌లు, సీఎన్‌జీ, మద్యం, ప్రకటనలు, మందులు, తరగతి గదులు, ఢిల్లీ జల్ బోర్డు, షీష్ మహల్, సీసీటీవీ, పానిక్ బటన్‌లకు సంబంధించిన అనేక కుంభకోణాలకు పాల్పడిందని శ్రీ అమిత్ షా వ్యాఖ్యానించారు.

మునుపటి కేంద్ర ప్రభుత్వం కూడా రూ. 12 లక్షల కోట్ల విలువైన కుంభకోణాలకు పాల్పడిందన్నారు. ప్రధానమంత్రిగా శ్రీ మోదీ 11 సంవత్సరాల పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని హోంమంత్రి తెలిపారు. మన ప్రభుత్వాలు నిజమైన ప్రజా సేవ పట్ల అంకితభావంతో ఉన్నాయని ఇది స్పష్టం చేస్తోందన్నారు.

కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఢిల్లీలో చెత్త పర్వతాలు 65 మీటర్ల ఎత్తుకు పెరిగాయన్నారు. 2028, జనవరి 1 నాటికి ఢిల్లీ వాసులు ఇకపై ఈ చెత్త పర్వతాలను చూడరని.. బదులుగా ఆ ప్రదేశాల్లో అందమైన తోటల అభివృద్ధి జరుగుతుందని ఆయన ప్రకటించారు. 2015 నుంచి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఢిల్లీ ప్రజల కోసం అందించిన అనేక పథకాల ప్రయోజనాలను మునుపటి ఢిల్లీ ప్రభుత్వం అడ్డుకుందని శ్రీ అమిత్ షా వ్యాఖ్యానించారు. రూ. 5 లక్షల వరకు ఉచిత చికిత్స అందించే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయడంలోనూ గత ప్రభుత్వం విఫలమవడంతో ఢిల్లీ ప్రజలకు దాని ప్రయోజనాలు అందకుండా పోయాయని కేంద్ర హోంమంత్రి తెలిపారు.

# గంజాయి మొక్కలను ధ్వంసం చేశారని.. పోలీసులపై తండావాసుల రాళ్ల దాడి

సంగారెడ్డి , అక్టోబర్ 11:సంగారెడ్డి జిల్లాలోని చల్లగిద్దా తండాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గంజాయి మొక్కలను ధ్వంసం చేశారని పోలీసులపై తండా వాసులు రాళ్ల దాడికి పాల్పడ్డారు.

చల్లగిద్దా తండాలో గంజాయి సాగు చేస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇవాళ ఉదయం తండాకు చేరుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పత్తి చేనులో గంజాయి మొక్కలు కనిపించగా, వాటిని పోలీసులు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై తండా వాసులు దాడికి దిగారు. రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. అంతటితో ఆగకుండా పోలీసుల సెల్‌ఫోన్లను తండా వాసులు లాక్కున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ పోలీసు బలగాలతో చల్లగిద్దా తండాకు చేరుకున్నారు.

# రూ. 16 లక్షల కోట్లు దాటిన ఎన్‌పీఎస్, ఏపీవై ఆస్తులు (ఏయూఎం) 9 కోట్లు దాటిన ఎన్‌పీఎస్,ఏపీవై చందదారుల సంఖ్య

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:ఎన్‌పీఏ (నేషనల్ పెన్షన్ సిస్టమ్), ఏపీవై (అటల్ పెన్షన్ యోజన) కింద నిర్వహణలో ఉన్న ఆస్తుల (ఏయూఎం) విలువ ఇవాళ రూ. 16 లక్షల కోట్లను దాటింది. చందాదారుల సంఖ్య కూడా 9 కోట్లను దాటటంతో భారతదేశ పింఛను ప్రయాణంలో ఇది ఒక ప్రధాన ఘట్టంగా నిలిచిపోనుంది.

ఎన్‌పీఎస్‌ను బలోపేతం చేయటం, పింఛన్ల విషయంలో సమ్మిళితత్వాన్ని పెంచేందుకు పీఎఫ్ఆర్‌డీఏ కీలక కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. 2025 అక్టోబర్ 1 నుంచి ఎమ్ఎస్ఎఫ్‌ను (మల్టీ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్) అమల్లోకి తెచ్చింది. ఇది పెట్టుబడుల విషయంలో చందదారులకు మరింత వెసులుబాటును అందిస్తోంది. ఎన్‌పీఎస్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ మోడల్ ద్వారా గిగ్ కార్మికులను పింఛను ప్రయోజనాలు అందనున్నాయి. పదవీ విరమణ సమయంలో తీసుకునే మొత్తం విషయంలో మరింత వెసులుబాటు కల్పించేందుకు గ్రేడెడ్ చెల్లింపులు, సౌకర్యవంతమైన యాన్యుటీని ప్రతిపాదిస్తోన్న ఎన్‌పీఎస్‌లో సమూల మార్పులపై కన్సల్టేషన్ పత్రాన్ని కూడా ప్రకటించింది. రైతులు, ఎంఎస్ఎంఈ కార్మికులు, ఎన్‌హెచ్‌జీ సభ్యులు, ఇతర అవ్యవస్థీకృత రంగాల్లోని వారికి పదవీ విరమణ ప్రయోజనాలను కల్పించాలన్న లక్ష్యంతో వివిధ అవగాహన కార్యక్రమాలను పీఎఫ్ఆర్‌డీఏ నిర్వహిస్తోంది. సమ్మిళితత్వం, మరింత వెసులుబాటు, దీర్ఘకాలిక ఆర్థిక భద్రతపై పీఎఫ్ఆర్‌డీఏ దృష్టిని ఇది తెలియజేస్తోంది. రూ. 16 లక్షల కోట్లకు పైగా ఆస్తులనే కీలక ఘట్టంతో పీఎఫ్ఆర్‌డీఏ.. భారతీయులందరికీ వృద్ధాప్య సమయంలో ఆదాయ భద్రత ఉండేలా చూసుకోవాలన్న దార్శనికతకు కట్టుబడి ఉంది.

# కన్జర్వేటివర్ అఫ్ ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ అధికారి బి.విజయ్ కుమార్

## -అటవీశాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

అమరావతి, అక్టోబర్ 11: క్రీడలతో మానసిక ఉల్లాసం




కలుగుతుందని కన్జర్వేటివర్ అఫ్ ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ అధికారి బి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆర్జీఎం కళాశాల గ్రౌండ్లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు రెండు రోజులు పండగ వాతావరణంలో ఉల్లాసంగా ఉత్సాహంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం వన్యమృగాలతో ఉంటూ అడవుల్లో విధులు నిర్వహించే అటవీ శాఖ ఉద్యోగులకు క్రీడలు చాల అవసరమన్నారు. సిబ్బంది ఎక్కువ శాతం అటవీ ప్రాంతంలోనే ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

అటవీ శాఖ సిబ్బంది ఒత్తిడికి లోను కాకుండా కొంత సమయాన్ని క్రీడలకు కేటాయిస్తూ ఆటవిడుపుగా తమ ఆరోగ్యాలను కాపాడుకునే అవకాశాన్ని కల్పించాలన్న సదుద్దేశంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 71వ ఎన్ఎస్టిఆర్ సర్కిల్ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా అటవీశాఖ ఉద్యోగులకు పోటీతత్వాన్ని స్ఫూర్తిని మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడలను ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రీడా పోటీల్లో నంద్యాల, ప్రకాశం జిల్లా గిద్దలూరు, మార్కాపురం, నంద్యాల జిల్లా ఆత్మకూరు, డివిజన్ల అటవీశాఖ ఉద్యోగులు కబడ్డీ,క్రికెట్, టెన్నిస్,లాంగ్ జంప్,తాడు లాగు తదితర పోటీల్లో పాల్గొన్నారు.

ఈ క్రీడా పోటీల్లో విజయం సాధించిన వారు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం విజేతలకు విజయ్ కుమార్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ అనురాగ్ మీనా, ప్రకాశం జిల్లా గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ అధికారిణి నిషాకుమారి,మహ్మద్ డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ అధికారి అబ్దుల్ రవుఫ్, సబ్ డివిజన్ డిఎఫ్ఓ బాలరాజు, ఏ సి ఎఫ్ సబ్ డివిజన్ డిఎఫ్ఓ,ఎస్.బి.శ్రీనివాస్ జెడ్. ఎఫ్ ఆర్ డి అధికారి నాసిర ఝా, జి బి ఎం ఎఫ్ ఆర్ ఓ ఉదయ్ దీప్, గాజులపల్లె జిడిటీ ఎఫ్ ఆర్ ఓ శ్రీనివాసులు, రుద్రవరం ఎఫ్ఆర్ఓ ముర్తుజావలి పాల్గొన్నారు.




# ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్‌కు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శ



మెదక్, అక్టోబర్ 11:ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి విజ్జయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగపూర్ గ్రామంలోని ఎర్రోళ్ల శ్రీనివాస్ నివాసానికి చేరుకున్నారు.

ఈ మేరకు ఎర్రోళ్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ నందికంటి శ్రీధర్, ముషీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ నాగేష్ ముదిరాజ్, కల్వకుంట పిఎసిఎస్ చైర్మన్ అందె కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బహిర్భూమికి వెళ్లిన ఇద్దరు పిల్లలు.. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి

మహబుబాబాద్ : కొత్తగూడ మండలం ఎంచగూడెంలో విషాదం చోటుచేసుకుంది. దసరా పండుగ కోసమని ఇటీవలే ఎంచగూడెం గ్రామానికి ఇటికాల నర్సయ్య, స్వాతి దంపతుల కుమారుడు రితిక్, నర్సయ్య సోదరి అనిత, శ్రీనివాస్ దంపతుల కుమారుడు జతిన్ అమ్మమ్మ ఇంటికి వచ్చారు. అయితే వీరి బంధువు ఒకరు చనిపోవడంతో.. కుటుంబ సభ్యులందరూ వేరే గ్రామానికి వెళ్లారు.

ఇంటి వద్ద ఉన్న రితిక్, జతిన్ కలిసి.. గ్రామ శివార్లలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు బహిర్భుమికి వెళ్లారు. ఇద్దరు కూడా ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రాణాలు కోల్పోయారు. బావిలో తేలియాడుతున్న పిల్లలను చూసి స్థానికులు అప్రమత్తమయ్యారు. పోలీసులకు సమాచారం అందించారు. కొత్తగూడ ఎస్ఐ రాజ్ కుమార్ తన బృందంతో ఘటనాస్థలానికి చేరుకుని రితిక్, జతిన్ మృతదేహాలను బావిలో నుంచి బయటకు తీశారు. ఇద్దరు పిల్లలు చనిపోవడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# భారత్-ఆస్ట్రేలియా రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:ఆస్ట్రేలియా ఉప ప్రధానమంత్రి, రక్షణ మంత్రి శ్రీ రిచర్డ్ మార్లెస్‌తో కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. రెండు దేశాల రక్షణ మంత్రుల చర్చ తరువాత జారీ చేసిన సంయుక్త ప్రకటన ఇలా ఉంది:

"భారత్-ఆస్ట్రేలియా రక్షణ మంత్రుల తొలి చర్చ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆస్ట్రేలియాకు రావాల్సిందిగా భారత రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌ను ఆస్ట్రేలియా ఉప ప్రధానమంత్రి, రక్షణ మంత్రి శ్రీ రిచర్డ్ మార్లెస్ ఆహ్వానించారు. ఈ చర్చా కార్యక్రమం రెండు దేశాల రక్షణ భాగస్వామ్యంలో చోటుచేసుకున్న అపూర్వ పురోగతితో పాటు సహకారాన్ని పెంపొందించుకోవాలన్న మంత్రుల తపనకు అద్దం పట్టింది. దీని కన్నా ముందు, ఆస్ట్రేలియా-భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని 2020లో ఉన్నతీకరించిన అనంతరం నాలుగుసార్లు జరిగిన ద్వైపాక్షిక సమావేశాల్లో మంత్రులు పాల్గొన్నారు.

రెండు దేశాల సమష్టి శక్తిని పెంచుకోవడానికీ, భద్రతకు దోహదపడటానికీ, ప్రాంతీయ శాంతికీ, భద్రతకూ ముఖ్య తోడ్పాటును అందించడానికీ సహకరించుకొనే విషయంలో దీర్ఘకాల దృష్టికోణం ముఖ్యమంటూ ప్రధానమంత్రులు చేసిన సూచనను మంత్రులు ముందుకు తీసుకెళ్లారు. నౌకా వాణిజ్య సహకారాన్ని ఇప్పటి కన్నా ఎక్కువగా పెంపొందించుకోవడానికి ఒక సంయుక్త నౌకా వాణిజ్య భద్రత సహకార మార్గసూచీ (రోడ్‌మ్యాప్)పై కూడా వారు చర్చించారు. రక్షణ, భద్రత సంబంధిత సహకారం విషయంలో సంయుక్త ప్రకటనను ప్రధానమంత్రులు అమల్లోకి తెస్తారని భావిస్తున్నారు.

రక్షణ మంత్రులతో ఒక వార్షిక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించి సంప్రదింపులనూ, సహకారాన్నీ పెంచుకొందామనీ, ద్వైపాక్షిక రక్షణ సంబంధిత ఏర్పాట్లను విస్తరించుకొందామనీ మంత్రులు సంకల్పించారు. జలాంతర్గాముల రక్షణకు మద్దతునూ, సహకారాన్నీ అందించుకొనే అంశాలకు సంబంధించిన కార్యాచరణపై ఆస్ట్రేలియా-భారత్ సంతకాలు చేయడం సంతోషదాయకమని మంత్రులు అన్నారు. విమానాలకు నింగిలోనే ఇంధనాన్ని నింపే అంశంలోనూ ఇలాంటిదే మరో కార్యాచరణపై 2024లో సంతకాలు చేయగా, దీని అమలు దిశగా అడుగులు పడుతుండడాన్ని కూడా వారు స్వాగతించారు.

రక్షణ రంగంలో నెలకొన్న భాగస్వామ్యం లాంటిదే ఇప్పుడు వివిధ రంగాలకు కూడా విస్తరించినందుకు మంత్రులు హర్షాన్ని వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో సంయుక్త విన్యాసాలనూ, కార్యకలాపాలనూ, ఉమ్మడి విధానాలను మరింతగా ముందుకు తీసుకుపోవడానికి ఒక వేదికలా పనిచేసే సిబ్బంది సంయుక్త చర్చల యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవడాన్ని మంత్రులు స్వాగతించారు. ఆస్ట్రేలియా 2025లో చేపట్టిన టాలిజ్మన్ సాబర్ విన్యాసంలో భారత్ పాల్గొనడాన్ని మంత్రి స్వాగతిస్తూ, 2027లోనూ ఈ సంప్రదాయాన్ని భారత్ కొనసాగిస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

రక్షణ విన్యాసాలు అంతకంతకూ సంక్లిష్టతను సంతరించుకోవడాన్నీ, ఈ విన్యాసాలు తరచుగా సాగుతుండడాన్నీ మంత్రులు ప్రశంసించారు. పరస్పర ఆధునిక రవాణా వ్యవస్థకు మద్దతిచ్చే అంశంలో ఒక కార్యాచరణను అమల్లోకి తెచ్చి సంయుక్త పని విధానాలను పెంచుకోవడం కూడా అభినందనీయమన్నారు. భారతీయ వాయు సేన 2024లో చేపట్టిన తరంగ్ శక్తి విన్యాసంలో రాయల్ ఆస్ట్రేలియన్ ఎయిర్ ఫోర్స్ పాలుపంచుకోవడం, అలాగే 2026లో అంతర నౌకాదళ కార్యక్రమాల్లో ఇరు దేశాల నౌకా దళం పాలుపంచుకోనుండడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. బ్లాక్ కారిలాన్ పేరుతో నిర్వహించబోయే జలాంతర్గామి రక్షక విన్యాసంలో పాల్గొనాల్సిందంటూ ఆస్ట్రేలియా ఆహ్వానాన్ని అందించడాన్ని భారత్ స్వాగతించింది.

ఆస్ట్రేలియాలోని రక్షణ కళాశాలలో 2026లో భారతీయ విద్యార్థులను అదనంగా చేర్చుకొనే ప్రతిపాదనతో పాటు, 2027లో ఆస్ట్రేలియన్ డిఫెన్స్ ఫోర్స్ అకాడమీలో మొదటిసారిగా ఒక పదవిని ఇవ్వనుండడం పట్ల మంత్రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రక్షణ సంబంధిత పారిశ్రామిక సహకారానికీ, భాగస్వామ్యానికీ వ్యూహాత్మక ప్రాధాన్యం ఉందని మంత్రులు స్పష్టం చేశారు. 2025 అక్టోబరు 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు భారత్‌లో ఆస్ట్రేలియాకు చెందిన ఒకటో డిఫెన్స్ ట్రేడ్ మిషన్‌తో పాటు ఆస్ట్రేలియాకే చెందిన ల్యాండ్ ఫోర్సెస్ ఎక్స్‌పో-2024లోనూ మొదటిసారిగా భారతీయ పెవిలియన్‌ను ఏర్పాటు చేయడాన్ని వారు స్వాగతించారు. ఇది రక్షణ పరిశ్రమ రంగంలో బలమైన ద్వైపాక్షిక సహకారం ఏర్పడిందని సూచిస్తోంది. అక్టోబరు 10న సిడ్నీలో ఆస్ట్రేలియా-భారత్ డిఫెన్స్ ఇండస్ట్రీ రౌండ్‌టేబుల్‌ను నిర్వహించ నుండడాన్ని కూడా మంత్రులు ప్రశంసించారు. సమకాలీన సాంకేతికతను అనుసరిస్తూ రక్షణ సంబంధిత సహకారాన్ని పెంచుకొనేందుకూ ఇరు పక్షాలు అంగీకరించాయి. దీనిలో భాగంగా రక్షణ పరిశ్రమ, పరిశోధన, సామగ్రి విషయాల్లో సంయుక్త కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని సంకల్పించాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని రాయల్ ఆస్ట్రేలియన్ నేవీ నౌకలకు నిర్వహణ, మరమ్మతు, ఇతర సేవలను భారత షిప్‌యార్డులు అందించినందుకు ఆస్ట్రేలియా- భారతదేశానికి ధన్యవాదాలు తెలిపింది.

మంత్రులు ఒక స్వతంత్ర, బహిరంగ, శాంతియుత, స్థిర, సమృద్ధ ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని పరిరక్షించడంలో సాయాన్ని అందించడానికి ప్రాంతీయ భాగస్వాములతో సహకారాన్ని ఇప్పటికన్నా పెంచుకోవలసిన అవసరం ఎంతయినా ఉందని స్పష్టం చేశారు. నౌకాయాన, విమానయాన స్వేచ్ఛకూ, ప్రాంతం పరంగా నిరాటంకమైన వాణిజ్యానికీ, అంతర్జాతీయ చట్టానికీ, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సముద్ర చట్ట సదస్సు-1982కు అనుగుణమైన సముద్ర సంబంధిత ఇతర చట్టబద్ధ ఉపయోగాలకు తాము గట్టి మద్దతును అందిస్తామని మంత్రులు తెలిపారు.

హిందూ మహాసముద్రంలో ఆస్ట్రేలియా, భారత్ నౌకా వాణిజ్య గస్తీ విమానాలు చేపట్టే సహకారాత్మక నౌకావాణిజ్య రంగ అవగాహన ప్రధాన కార్యకలాపాలు, జలాంతర్గామి నిరోధక యుద్ధ కార్యకలాపాల పట్ల మంత్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యకలాపాలకు సంబంధించిన అనుబంధాన్ని పెంపొందించుకోవడానికి ఇరు దేశాల భూభాగాల నుంచి విమానాల మోహరింపును కొనసాగించడానికి కూడా వారు అంగీకారాన్ని తెలిపారు. ఉమ్మడి సవాళ్లను పరిష్కరించుకోవడానికి ఆస్ట్రేలియా-భారత్-ఇండొనేసియా త్రైపాక్షిక ఫార్మేట్‌లో భాగంగా ప్రస్తుతం కొనసాగుతున్న సహకారాన్ని మంత్రులు స్వాగతించారు.

ఆస్ట్రేలియా, భారత్, జపాన్, యునైటెడ్ స్టేట్స్ మధ్య రక్షణ సహకారంలో చోటుచేసుకుంటున్న పురోగతిని మంత్రులు స్వాగతించారు. భాగస్వాముల మధ్య వ్యూహాత్మక సహకారం విస్తరిస్తోందని స్పష్టం చేశారు. నౌకావాణిజ్య రంగంలో అవగాహనను పెంచకోవడంపట్ల నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, 2025 నవంబరులో మలబార్ విన్యాసాన్ని చేపట్టే కాలంలోనే మరో సహకార ప్రధాన కార్యాచరణకు కూడా రంగం సిద్ధం కాగలదన్న భావాన్ని వ్యక్తం చేశారు. నాలుగు భాగస్వామ్య దేశాల మధ్య సన్నిహిత నౌకావాణిజ్య నిఘా సంబంధిత సహకారాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలకు ఆస్ట్రేలియా, భారత్ గట్టి మద్దతును తెలిపాయి. జపాన్‌తో కలిసి 2025లో భారత్, యునైటెడ్ స్టేట్స్‌ల చేపట్టే గగనతల విన్యాసం 'కోప్ ఇండియా'ను మొదటిసారి పరిశీలించే అవకాశం లభించడాన్ని స్వాగతించారు.

ఇరు పక్షాలూ తమ తమ సైన్యాల మధ్య సహకారం పెంపొందుతున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేశాయి. సైన్య సహకారాన్ని విస్తరించుకోవడం, ముఖ్యంగా భూతల, ఉపరితల విన్యాసాలు, కార్యకలాపాల్లోనూ, ఎక్సర్‌సైజ్ పుక్-పుక్ వంటి విన్యాసాల్లోనూ భాగస్వామ్యం రూపేణా పరస్పర సహకారాన్ని అందించుకోవాలన్న నిబద్ధతను మంత్రులు పునరుద్ఘాటించారు. ఎక్సర్‌సైజ్ ఆస్ట్రాహింద్ పరిధి పెరుగుతుండడాన్నీ, సంక్లిష్టత అధికంకావడాన్నీ వారు స్వాగతించారు. నిపుణుల మార్పిడి ద్వారా ఏకీకృత వాయు, క్షిపణి రక్షణ, సురక్షిత కమ్యూనికేషన్లు, మానవ రహిత వాయు వ్యవస్థలు, కౌంటర్-యూఏఎస్, ప్రత్యేక కార్యకలాపాలు తదితర ముఖ్య రంగాల్లో అత్యుత్తమ పద్ధతులను పరస్పరం పంచుకోవడానికి ప్రాధాన్యం ఉందని వారు పేర్కొన్నారు.

పాపువా న్యూ గినీ 50వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలోనూ, ఫిజీ పోర్ట్ కాల్ లోనూ భారతీయ నౌకా దళానికి చెందిన కద్‌మత్ నౌక పాల్గొనడాన్ని మంత్రులు అభినందించారు. ఆస్ట్రేలియా నిర్వహించే ఆపరేషన్ రెండర్ సేఫ్ భావి కార్యకలాపాల్లో పాల్గొనాల్సిందిగా భారత్‌ను ఆస్ట్రేలియా ఉప ప్రధానమంత్రి ఆహ్వానించారు.

రక్షణ మంత్రుల 2026 వార్షిక చర్చా కార్యక్రమంలో పాల్గొనడానికి భారత్‌కు రావాలంటూ రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఆహ్వానించగా, ఆస్ట్రేలియా ఉప ప్రధానమంత్రి శ్రీ మార్లెస్ అందుకు అంగీకరించారు."

# యాదాద్రీశుని సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి..



యాదగిరిగుట్ట, అక్టోబర్11: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆయన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కే. లక్ష్మణ్, జస్టిస్ కే. శరత్, జస్టిస్ కే. సుజన, జస్టిస్ వి రామకృష్ణా రెడ్డితో కలిసి యాదగిరిగుట్టకు చేరుకున్నారు. కొండపైకి చేరుకున్న వారికి కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఇన్‌చార్జి ఈవో రవి నాయక్ పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. ప్రధానాలయానికి చేరుకున్న ఆయన స్వయంభు లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయముఖ మండపంలో వారికి ఆలయ ఈవో రవి నాయక్ స్వామి వారి ప్రసాదం చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు, ఏసీపీ శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 5జీ నాయకత్వం నుంచి 6జీ సామర్థ్యం వైపు భారత్ పురోగమనానికి దిశా నిర్దేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:భారత మొబైల్ కాంగ్రెస్ 2025 సందర్భంగా ఈరోజు జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో భారత టెలికమ్యూనికేషన్స్ విభాగం (డాట్) త్వరలో జరిగే అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతికత ఆవిష్కరణ సదస్సు (ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ - ఈఎస్టీఐసీ) 2025 కోసం 'డిజిటల్ కమ్యూనికేషన్' ఇతివృత్తాన్ని విజయవంతంగా ప్రారంభించింది. ఈ ప్రత్యేక కార్యక్రమం భారత్ 6జీ అలయన్స్ (బీ6జీఏ) ప్రారంభ సమావేశానికి కూడా వేదికగా నిలిచింది. ఇది వచ్చే తరం టెలికాం ఆవిష్కరణలలో భారత్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుంది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ సూద్, డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్ చైర్మన్, భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ అధ్యక్షత వహించారు. గత దశాబ్దంలో భారతదేశం సాధించిన అసాధారణ డిజిటల్ మార్పును ప్రతిబింబించడంతో పాటు, 6జీ శకంలో ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రతిష్ఠాత్మక దార్శనికతను ప్రదర్శించే ఒక వీడియో ఆవిష్కరణ ,ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పరిమిత కనెక్టివిటీ నుంచి ప్రపంచ డిజిటల్ నాయకత్వ దశకు భారత్ పరిణామక్రమాన్ని ఈ వీడియో చూపిస్తుంది. ఈ ప్రయాణాన్ని రూపుదిద్దడంలో విధానాలు, ఆవిష్కరణలు, సమ్మిళిత చొరవల కీలక పాత్రను కూడా స్పష్టం చేసింది.

ఈ సందర్భంగా డాక్టర్ నీరజ్ మిట్టల్ మాట్లాడుతూ, కనెక్టివిటీ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం, ఆవిష్కరణల ప్రాముఖ్యతను పేర్కొన్నారు. భారత్ భవిష్యత్తును ఉజ్వలంగా ఊహించుకోవాలని, దానిని నిజం చేసేందుకు ఆవిష్కరణలు చేయాలని, తద్వారా వికసిత భారత్ సాధన దిశగా తర్వాతి తరాన్ని నడిపించాలని పిలుపునిచ్చారు.

ప్రొఫెసర్ అజయ్ సూద్ తన ప్రసంగంలో, భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు టెలికమ్యూనికేషన్స్ వెన్నెముక వంటిదని అన్నారు. దేశీయ ఆవిష్కరణలు, వ్యూహాత్మక విధాన ప్రణాళికలపై టెలికమ్యూనికేషన్స్ విభాగం నిరంతర దృష్టిని ఆయన అభినందించారు. ఈ రోజు ఆవిష్కరించిన డిజిటల్ కమ్యూనికేషన్ ఇతివృత్తం భారతదేశ అసాధారణ ప్రయాణానికి, ప్రపంచ 6జీ పోటీలో అగ్రగామిగా నిలవాలనే పెరుగుతున్న విశ్వాసానికి ప్రతిబింబమని ఆయన తెలిపారు. టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్, రాబోయే రీసెర్చ్, డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ (ఆర్డీఐ) పథకం వంటి కార్యక్రమాలు ప్రపంచ టెక్నాలజీ నాయకత్వం కోసం భారత్ అన్వేషణలో కీలకమైన ప్రేరక శక్తులుగా పని చేస్తాయని ఆయన తెలిపారు. ఈఎస్టీఐసీ - 2025 లో భాగంగా నవంబర్ 5న జరిగే డిజిటల్ కమ్యూనికేషన్ థీమెటిక్ సెషన్లో వైర్లెస్ కమ్యూనికేషన్స్‌లో విశిష్ట నిపుణులుగా పేరొందిన ఐఐటి హైదరాబాద్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ కుచి ప్రధానోపన్యాసం చేస్తారు. ఈ థీమెటిక్ సెషన్‌లో ప్రముఖ ఆలోచనాపరులు, ప్రాక్టిషనర్లు పాల్గొని డిజిటల్ కనెక్టివిటీ భవిష్యత్తు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో భారత్ నాయకత్వంపై చర్చిస్తారు.

స్వదేశీ టెలికాం ఆవిష్కరణ, ప్రామాణీకరణలో ప్రసిద్ధుడైన తేజస్ నెట్‌వర్క్స్ సీటీఓ, సహ వ్యవస్థాపకుడు శ్రీ కుమార్ శివరాజన్, స్టార్టప్ వ్యవస్థలో విలక్షణ మార్పులకు ప్రాతినిధ్యం వహిస్తున్న లేఖ వైర్‌లెస్ సహ వ్యవస్థాపకుడు డైరెక్టర్ శ్రీ రాము శ్రీనివాసయ్య, వీవీడీఎన్ టెక్నాలజీస్ సీటీఓ శ్రీ పునీత్ అగర్వాల్ థీమాటిక్ సెషన్‌లో ప్రసంగిస్తారు. స్వదేశీ టెలికాం తయారీ రంగంలో పెరుగుతున్న భారత్ శక్తిసామర్థ్యాలను వారు వివరిస్తారు.

అనంతరం జరిగే ఉన్నత స్థాయి ప్యానెల్ చర్చ లో సి-డాట్ సీఈఓ డాక్టర్ రాజ్ కుమార్ ఉపాధ్యాయ దేశంలోని ప్రధాన టెలికాం ఆర్ అండ్ డి సంస్థ కార్యకలాపాలను వివరిస్తారు. బిఎస్ఎన్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎ. రాబర్ట్ జెరార్డ్ రవి, ప్రభుత్వ రంగ సంస్థల కీలక పాత్రను వివరిస్తారు.

# జాతీయ రహదారిపై ప్రైవేట్ బస్ బోల్తా.. ప్రయాణికులకు గాయాలు

అమరావతి, అక్టోబర్ 11: ఏపీలోని నెల్లూరు జిల్లా కోవూరు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయా లయ్యాయి. నవీన్ ట్రావెల్స్ బస్సులో 46 మంది ప్రయాణికులు భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు బయలు దేరారు. కోవూరు వద్ద డ్రైవర్ నిద్రమత్తులో ఉండగా ఒక్కసారిగా బస్సు బోల్తా పడింది.

దీంతో బస్సులో ఉన్న ప్రయాణికుల్లో నలుగురు , డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని నెల్లూరులోని ఆస్పత్రికి తలరించారు. రోడ్డు ప్రమాదం వల్ల ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.కడప జిల్లా ఒంటిమిట్ట ఆలయం వద్ద ఆగి ఉన్న లారీని పులివెందుల నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కండక్టర్‌కు గాయాలు కాగా ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు.

# నల్లమల పులి కాదు నల్లమల పిల్లి.. హరీశ్‌రావు సెటైర్లు

హైదరాబాద్, అక్టోబర్ 11: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు.. నల్లమల పిల్లి అని మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. కింద గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే.. పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

రేవంత్ రెడ్డి మొన్న మల్లికార్జున ఖర్గేను పరామర్శించడానికి కర్ణాటకకు వెళ్లినప్పుడు, ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు గురించి సిద్ధరామయ్య, శివ కుమార్ దగ్గర మాట్లాడుతాడు అనుకున్నా. వాళ్ళ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అయినా రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుద్దని కనీసం బుద్ధి రేవంత్ రెడ్డికి లేదు. రాహుల్ గాంధీతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ఫోన్ కూడా చేపించలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ఢిల్లీకి బ్యాగులు మోయడం ఒక్కటే పని కాదు.. తెలంగాణ బాగోగుల గురించి కూడా పట్టించుకో అని హరీష్ రావు సూచించారు.

ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది.. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది. 112 టీఎంలు కర్ణాటక, 74 టీఎంసీలు మహారాష్ట్ర ఆపితే మన పరిస్థితి ఏంది. మాట్లాడితే నల్లమల బిడ్డ అంటాడు.. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో ఆ మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు.

# 'అందులో మా పాత్ర లేదు'.. మహిళా జర్నలిస్టులపట్ల వివక్షపై కేంద్రం



న్యూఢిల్లీ, అక్టోబర్ 11: ఢిల్లీలోని అఫ్ఘనిస్థాన్ రాయబార కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రెస్ మీట్ కు మహిళా జర్నలిస్టులను అనుమతించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారత పర్యటనలో ఉన్న ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముత్తాఖీ ఈ ప్రెస్‌మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రెస్ మీట్ కోసం వచ్చిన మహిళా జర్నలిస్టులను లోపలికి అనుమతించలేదు. దాంతో కేంద్ర ప్రభుత్వంపై సోషల్ మీడియాలో, బయట విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలను అవమానిస్తుంటే కేంద్రం ఏంచేస్తోందని విపక్ష పార్టీల నేతలు, నెటిజన్‌లు మండిపడుతున్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

దాంతో ఈ అంశంపై కేంద్ర సర్కారు స్పందించింది. మహిళా జర్నలిస్టులను ప్రెస్ మీట్‌కు అనుమతించకపోవడంలో మా పాత్ర ఏమీ లేదని స్పష్టం చేసింది. ప్రెస్ మీట్‌కు జర్నలిస్టులను ఆహ్వానించే బాధ్యతను ముంబైలోని ఆఫ్ఘనిస్థాన్ కాన్సుల్ జనరల్ తీసుకున్నారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. తమ దేశానికి చెందిన విదేశాంగ మంత్రి భారత పర్యటన నేపథ్యంలో ఆయన ఢిల్లీకి వచ్చారని పేర్కొంది.

కాగా ప్రతిపక్షాలు కూడా ప్రెస్ మీట్‌కు మహిళా జర్నలిస్టులకు అనుమతి నిరాకరించడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కూడా ఈ అంశంపై స్పందించారు. 'బహిరంగ కార్యక్రమానికి మహిళా జర్నలిస్టులకు అనుమతి నిరాకరించడాన్ని మీరు ఎలా సమర్థిస్తారు..?' అని ఆయన ప్రధాని మోదీని ప్రశ్నించారు. ప్రధాని దేశంలోని ప్రతి మహిళతో 'మీకు అండగా నిలబడటం లో నేను బలహీనుడను' అని చెప్పాలని సూచించారు.

'ప్రధాని మోదీకి ఎన్నికలప్పుడే మహిళలు, మహిళల హక్కులు గుర్తుకొస్తాయా..?' అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఇలాంటి సమయంలో ప్రధాని మౌనంగా ఉండటం 'నారీ శక్తి' అంటూ ఆయన ఇచ్చే నినాదాలను బలహీనం చేస్తున్నాయని విమర్శించారు.

# సంయుక్త సిబ్బంది చర్చల ఏర్పాటుపై విధివిధానాలకు సంబంధించి కీలక ఒప్పందాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:ఆస్ట్రేలియాలో రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అక్టోబర్ 9, 2025న కాన్ బెర్రాలో ఆస్ట్రేలియా ఉప ప్రధానమంత్రి, రక్షణ మంత్రి మిస్టర్ రిచర్డ్ మార్లెస్ తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.

భారత్-ఆస్ట్రేలియా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన ఈ సమావేశంలో సైనిక విన్యాసాలు, సముద్ర భద్రత, రక్షణ పరిశ్రమ సహకారం, సైన్స్ అండ్ టెక్నాలజీలో సంయుక్త పరిశోధన సహా రక్షణ సహకారాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు ఇరుదేశాలు సంసిద్ధతను తెలియజేశాయి.

భారత్-ఆస్ట్రేలియా మధ్య సాంస్కృతిక సంబంధాలు, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలే ఆధారమని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రారంభమైనప్పటి నుంచి సంబంధాలు మెరుగయ్యాయని, రక్షణ రంగంలో సహకారం విస్తృతమైందని ఆయన తెలిపారు. సమాచార భాగస్వామ్యం, జలాంతర్గామి శోధన, రక్షణ సహకారం, సంయుక్త సిబ్బంది చర్చల ఏర్పాటుపై విధివిధానాలకు సంబంధించి సమావేశం చివర్లో మూడు ఒప్పందాలు కుదిరాయి.

ఈ సమావేశంలో ఉగ్రవాద ముప్పుపై భారత్ వైఖరిని స్పష్టం చేస్తూ.. ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగలేవని, ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి కొనసాగవని, నీళ్లు, రక్తం కలసి ప్రవహించలేవని రక్షణ మంత్రి శ్రీ రాజ్ నాథ్ తెలిపారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌కు ఆస్ట్రేలియా ప్రధానమంత్రి శ్రీ ఆంథోనీ అల్బనీస్ సాదర స్వాగతం పలికారు. మే 2025 ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు అల్బనీస్‌కు అభినందనలు తెలిపిన రక్షణ మంత్రి... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అద్భుతమైన ఆర్థిక పురోగతిని సాధించిందని, ముఖ్యంగా రక్షణ, సైబర్ భద్రత, ఐటీ రంగాల్లో సాధించిన అభివృద్ధిని శ్రీ ఆంథోనీ ఆల్బనీస్ ప్రశంసించారు. కోట్లాది మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని అభినందించిన ఆయన.. రాబోయే ఏళ్లలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఆసక్తి కనబరిచారు.

భారత్-ఆస్ట్రేలియా రక్షణ భాగస్వామ్యాన్ని స్పష్టం చేస్తూ ఇరుదేశాల మధ్య బలమైన సంబంధాలను, పరస్పర విశ్వాసాన్ని తెలియజేసేలా సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

పర్యటన ప్రారంభంలో శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌కు ఆస్ట్రేలియా రక్షణ శాఖ సహాయమంత్రి శ్రీ పీటర్ ఖలీల్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. రక్షణ మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కేసీ-30ఏ మల్టీరోల్ ట్రాన్స్‌పోర్ట్, ట్యాంకర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ టీటీ)... గాలిలో ఇంధనాన్ని నింపే ప్రత్యక్ష ప్రదర్శనను వీక్షించారు. ఇది కాన్‌బెర్రాకు వెళ్తున్న ఎఫ్-35 విమానానికి ఇంధనాన్ని నింపింది. గాలిలో ఇంధనం నింపే ఏర్పాట్ల అమలుపై గతేడాది కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి ఉమ్మడి కార్యాచరణ సామర్థ్య ప్రదర్శనగా ఇది నిలిచింది. ఆస్ట్రేలియా పార్లమెంట్ హౌస్‌కు చేరుకున్న తర్వాత, శ్రీ రిచర్డ్ మార్లెస్ సమక్షంలో... రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌కు సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలికారు.

# అదనపు కలెక్టర్ కొల్ల బత్తుల కార్తీక్



నంద్యాల, అక్టోబర్ 11: నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం కొల్ల బత్తుల కార్తీక్ నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఛాంబర్‌లో సహచర అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ జిల్లా పరిపాలనలో సమర్థత, పారదర్శకతను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాల ఫలితాలను ప్రజలకు చేరవేసే దిశగా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసే దిశలో చర్యలు చేపట్టటం విశేషమని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# అనంతలోకాలకు చిన్నారులు



కొత్తగూడెం, అక్టోబర్ 11: దసరా పండగ అని తాతగారింటికి వచ్చిన ఓ ఇద్దరూ చిన్నారులు ఆటకని వెళ్లి అనంతలోకాలకు వెళ్లిపోయిన సంఘటనతో మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన సారయ్య, నర్సమ్మ ఇంటికి దసరా పండగ కోసం మనుమళ్లు వచ్చారు. దసరా పండగా సంతోషంగా గడిచిపోయింది. అయితే ఈ రోజు ఉదయం సారయ్య కుమారుడు నర్సయ్య కుమారుడు రీతిక్ (10), శ్రీనివాస్ కుమారుడు జతిక్ (9) కనిపించకపోవడంతో ఆడుకోవడానికి వెళ్లి కనిపించలేదు. దీంతో వారి కోసం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వెతికారు. అయితే వ్యవసాయ బావి వద్ద వారిద్దరి దుస్తులు కనిపించాయి. దీంతో వ్యవసాయభావిలో చూడగా రీతిక్ మృతదేహం లభ్యమైంది. జతిక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ప్రత్యర్థి పార్టీలు, అభ్యర్థులపై చేసే ఏఐ ఆధారిత వీడియోల విషయంలో ఎంసీసీ, ఇతర మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించిన ఈసీఐ

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:2025 అక్టోబర్ 6న బీహార్ శాసన సభ ఎన్నికలు, 8 అసెంబ్లీ నియోజక వర్గాలకు ఉప ఎన్నికలు ప్రకటించిన తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమాలతో సహా ఇంటర్నెట్‌లో చేసే పోస్టులకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి.

ఎంసీసీ నిబంధనల ప్రకారం ఇతర పార్టీలపై విమర్శలను.. విధానాలు, కార్యక్రమాలతో పాటు గత పనులు, రికార్డులకే పరిమితం చేయాలి. పార్టీలు, అభ్యర్థులు.. ఇతర పార్టీల నాయకులు లేదా కార్యకర్తల విషయంలో ప్రజా కార్యకలాపాలతో సంబంధం లేని వారి వ్యక్తిగత జీవితంలోని ఏ అంశాన్నీ విమర్శించకూడదు. ధ్రువీకరణ లేని ఆరోపణలు, వక్రీకరణ ఆధారంగా ఇతర పార్టీల లేదా కార్యకర్తలను విమర్శించకూడదు.ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్న ఈసీఐ.. సామాజిక మాధ్యమాల్లో వాస్తవాల వక్రీకరణ, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసే విషయంలో డీప్ ఫేక్‌ను సృష్టించేందుకు ఏఐ సాధనాలను దుర్వినియోగం చేయొద్దని ఎన్నికల సంఘం రాజకీయ నాయకులకు సూచించింది.

ఏవైనా రాజకీయ పార్టీలు, వాటి నాయకులు, అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్లు సామాజిక మాధ్యమాల్లో కృత్రిమ కంటెంట్ లేదా ఏఐ తయారు చేసిన కంటెంట్‌ను ప్రచారంలో భాగంగా లేదా ప్రకటనల్లో ఉపయోగించినట్లయితే వాటిపై 'ఏఐ జనరేటెడ్', 'డిజిటల్లీ ఎన్‌హ్యాన్స్‌డ్', 'సింథటిక్ కంటెంట్' వంటి స్పష్టమైన లేబుళ్లు ఉండే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి.



# యువజన ఉత్సవాలలో ఉత్సాహంగా పాల్గొనండి

## -యువతకు కలెక్టర్ డా. ఎ. సిరి సూచన



కర్నూలు, అక్టోబర్ 11: జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో జరగనున్న జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ డా. ఎ. సిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువజన ఉత్సవాలు యువత ప్రతిభను వెలికితీసే వేదికగా నిలుస్తాయని, జిల్లాలోని యువత ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లా యువజనోత్సవ పోటీలు ఈ నెల 22న కర్నూలులోని రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్నాయి. 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయస్సు గల యువ కళాకారులు ఏడు విభాగాలలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు.

జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు, రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని వివరించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేయబడతాయని, పాల్గొన్న కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇవ్వబడతాయని తెలిపారు.

సెట్కూరు సీఈఓ డా. వేణుగోపాల్ మాట్లాడుతూ, పోటీల్లో పాల్గొనదలచిన యువతీ యువకులు తమ పేరు లేదా బృందం పేరును వెబ్ లింక్ ష్ట్రబిబిజాబ://ఎతిబి.శ్రీఎ/ నెనిశ్రీటఎట25 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ నమోదు సౌకర్యం లేని వారు నేరుగా అక్టోబర్ 22న ఉదయం 9 గంటలలోపు వేదిక వద్ద వచ్చి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు మొబైల్ నంబర్ 92922 07601 ద్వారా సంప్రదించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్‌మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి లాలెప్ప, కలెక్టరేట్ పరిపాలన అధికారి శివరాముడు, సెట్కూరు పర్యవేక్షణ అధికారి శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

## లెఫ్టిస్ట్.. రైటిస్ట్.. కాదు బ్యాలెన్స్ ముఖ్యం.. పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

అమరావతి, అక్టోబర్ 11:మానసిక పరిపక్వత రావాలంటే పుస్తకాలు చదవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. తనపై పుస్తకాలు చాలా ప్రభావం చూపాయని తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఐరాస మాజీ సహాయ సెక్రటరీ జనరల్ లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రచించిన 'ఆమె సూర్యుడిని కబళించింది' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. జీవితంలో పుస్తకాల విలువను తెలియజేశారు. నా గురించి నాకు ఏమీ చెప్పుకో వాలో తెలియదని పవన్ కల్యాణ్ అన్నారు. నేను రచయితను కాను.. కానీ నా ఆలోచనలను మాత్రం పంచుకోగలనని పేర్కొన్నారు. తాను భారతీయ ఆలోచనా విధానం నుంచి వచ్చినవాడిని అని చెప్పారు. చిన్నతన ం నుంచి పుస్తకాలు చదవడం అలవా టు చేసుకున్నానని తెలిపారు. నేను వామపక్ష వాద పుస్తకాలు, జాతీయ వాదం గురించి చెప్పే పుస్తకాలను చదువుతానని పేర్కొ న్నారు. లెఫ్టిస్ట్.. రైటిస్ట్ అనేది కాకుండా జీవితంలో బ్యాలెన్స్ ముఖ్యమని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏ విషయం లోనైనా సమతుల్యత పాటించడం ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

# తిరుపతిలో జాతీయ స్థాయి వర్క్‌షాప్, సమీక్ష సమావేశం..

## -ప్రారంభించిన సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశీష్ కుమార్ భూటాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:సహకార రంగాన్ని బలోపేతం చేయడంపై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్- సమీక్ష సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించారు. సహకార మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్రాలు-కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రతినిధులు, కార్యదర్శులు, సహకార సంఘాల రిజిస్ట్రార్లు (ఆర్‌సీఎస్), సహకార రంగానికి చెందిన కీలక భాగస్వాములు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌ను సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశీష్ కుమార్ భూటాని.. అదనపు కార్యదర్శి శ్రీ పంకజ్ కుమార్ బన్సాల్, మంత్రిత్వ శాఖలోని ఇతర సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖుల సమక్షంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ భూటాని కీలకోపన్యాసం ఇచ్చారు. 'సహకారంతో సమృద్ధి' దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో సహకార ఉద్యమానికి ఉన్న కీలక పాత్రను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. నేడు సహకార సంస్థలు.. వ్యవసాయం, రుణాలు వంటి సంప్రదాయ రంగాలకు మించి ఆరోగ్య సంరక్షణ, సేవలు, వాణిజ్య కార్యకలాపాల ఏకీకరణ వంటి రంగాలకు విస్తరించాయని పేర్కొన్నారు. సహకార సంస్థలను ప్రజా కేంద్రీకృత, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వ్యవస్థలుగా ఉండేలా చూసుకునేందుకు సంస్థాగత, మానవ వనరుల అభివృద్ధికి సాంకేతిక పురోగతిని ఉపయోగించేందుకు మంత్రిత్వ శాఖ నిబద్ధతతో ఉన్నట్లు ఆయన తెలిపారు.

సహకార రంగ డిజిటల్ పరివర్తనను వేగవంతం చేయడంపై దృష్టి సారిస్తూ పీఏసీఎస్, ఏఆర్‌డీబీలు, సహకార సంఘాల రిజిస్ట్రార్ల కార్యాలయాల కంప్యూటరీకరణపై ఒక ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. పీఏసీఎస్ కార్యకలాపాలు పూర్తిగా డిజిటలైజ్ అయ్యేలా చూసుకోవటం, పీఏసీఎస్ సిబ్బంది - సభ్యుల డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించటం.. వ్యవసాయ వనరులు, రుణాలు, పంటల కొనుగోళ్లు, నిల్వ వంటి సమగ్ర సేవలను అందించే ఒకే కేంద్రంగా పీఏసీఎస్‌లను మార్చేందుకు ఉపయోగపడే పనులకు ఈ చర్చల్లో ప్రముఖ స్థానం లభించింది. ఈ ప్రాజెక్ట్ కోసం సాఫ్ట్‌వేర్ తయారు చేయటం, హార్డ్‌వేర్ కొనుగోళ్లు, సామర్థ్య నిర్మాణంలో సహకారంపై తాజా సమాచారాన్ని నాబార్డ్ తెలియజేసింది.

సహకార రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్య నిల్వకు సంబంధించిన ప్రణాళిక ఈ సెషన్‌లో మరో ముఖ్యమైన అంశంగా ఉంది. ప్రయోగాత్మక దశలో 500 ప్యాక్స్‌తో ప్రారంభించే ఈ ప్రాజెక్ట్‌ను 29,000 ప్యాక్స్‌లకు విస్తరించనున్నారు. ఈ ప్రణాళిక అమలును వేగవంతం చేయడంపై వర్క్‌షాప్ దృష్టి సారించింది. వ్యాపార వైవిధ్యీకరణ ద్వారా గోడౌన్ల ఆర్థిక వెసులుబాటును చూసుకోవటం, భూ లభ్యత- సహకార సామర్థ్యాలు - కలిగి ఉన్న మౌలిక సదుపాయాల ఆధారంగా ప్యాక్స్‌లను మ్యాపింగ్ చేయడం, కార్యకలాపాలు సుస్థిరంగా కొనసాగేలా చూసుకునేందుకు సాంకేతిక- నిర్వాహక మద్దతును అందించడం వంటి అంశాలను ప్రధానంగా చర్చించారు.

ఈ సెషన్‌లో అన్ని పంచాయతీలు, గ్రామాలలో రెండు లక్షల బహుళ ప్రయోజనాల పీఏసీలు, పాడి పరిశ్రమ- మత్స్య సహకార సంఘాల ఏర్పాటు.. వాటి బలోపేతం గురించి కూడా చర్చించారు. కొత్త సహకార సంస్థల ఏర్పాటుకు ఆస్కారం ఉన్న జిల్లాలు, బ్లాక్‌లను గుర్తించడం.. వ్యాపారాన్ని మెరుగుపరచటం, వైవిధ్యీకరణ ద్వారా ఇప్పటికే ఉన్న సహకార సంస్థలను బలోపేతం చేయడం.. గ్రామీణ జీవనోపాధి కల్పనకు అట్టడుగు వరకు అనుసంధానత ఉండేలా చూసుకోవటంపై ఈ సెషన్ దృష్టి సారించింది.

అంతర్జాతీయ సహకార సంవత్సరం (ఐవైసీ), మీడియా అనుసంధానతను ఈ వర్క్‌షాప్ ప్రత్యేక విభాగంగా తీసుకుంది. ఐవైసీ -2025కి ఉన్న ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తోంది. దీనికి సంబంధించిన ప్రధాన కార్యక్రమాలను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల క్రియాశీలకంగా నిర్వహించాలని ఇది పిలుపునిచ్చింది. "తల్లి పేరు మీద ఒక చెట్టు" నామంతో చేపట్టిన మొక్కలను నాటే కార్యక్రమం వంటి కీలక కార్యక్రమాలను ప్రాముఖ్యత ఈనీట ప్రస్తావించింది. కీలక ప్రామాణికతల ప్రకారం సహకార సంస్థలు సాధించిన పురోగతి పరిగణనలోకి తీసుకుంటూ సహకార అవార్డులను ఇవ్వాలని రాష్ట్రాలను కోరింది. ప్రజలను చేరుకోవటం అనే అంశానికి ఉన్న ప్రాముఖ్యతను ఈ విభాగం ప్రముఖంగా ప్రస్తావించింది. ఉత్తమ పద్ధతులు, ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు సామాజిక మాధ్యమాన్ని విస్తృతంగా ఉపయోగించుకోవాలని ఈ సెషన్ తెలియజేసింది.

సహకార బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై మరో సెషన్ నిర్వహించారు. ఈ సెషన్ చర్చల్లో ఆర్‌బీఐ సీనియర్ అధికారులు కూడా చురుకుగా పాల్గొన్నారు.

సహకార రంగాన్ని బలోపేతం చేయడంపై నిర్వహించిన ఈ వర్క్‌షాప్ రెండో రోజు "వ్యాపార వైవిధ్యీకరణ ద్వారా ప్యాక్స్‌ల పరిధిని పెంచటం" అనే విషయంలో ఉత్తమ పద్ధతులపై దృష్టి సారిస్తూ ఉత్తమ పద్ధతులకు సంబంధించిన సెషన్‌తో ప్రారంభమైంది. ఈ విషయంలో కీలక కార్యక్రమాలపై కూడా ఈ సెషన్‌లో చర్చించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సంబంధిత ఉత్తమ పద్ధతులను హాజరైన వారితో పంచుకున్నాయి.

ఈ వర్క్‌షాప్ ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ కింద నేషనల్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్), నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సీఓఎల్), భారతీయ బీజ్ సహకారి సమితి లిమిటెడ్ (బీబీఎస్ఎస్ఎల్) అనే మూడు జాతీయ స్థాయి బహుళ రాష్ట్రాల సహకార సంఘాల పురోగతిని కూడా సమీక్షించింది.

మార్చి 2024లో ప్రారంభించిన జాతీయ సహకార డేటాబేస్ (ఎన్‌సీడీ) అమలును కూడా సహకార మంత్రిత్వ శాఖ సమీక్షించింది. ఎన్‌సీడీ పరిధిలోకి 30 రంగాలకు చెందిన 8.4 లక్షలకు పైగా సహకార సంస్థలు, 32 కోట్ల మంది సభ్యులు వస్తారు. సహకార కార్యకలాపాలు, ఆర్థిక ప్రదర్శన, ఆడిట్ పరిస్థితి, మౌలిక సదుపాయాలపై వివరణాత్మక సమాచారాన్ని ఎన్‌సీడీ అందిస్తుంది.

ఇఫ్కో-టోకియో ప్రతినిధుల సమక్షంలో బీమా రంగంలో సహకార సంఘాల పాత్రపై చేపట్టిన చర్చ ఈ వర్క్‌షాప్‌లో మరో ముఖ్యమైన సెషన్‌గా ఉంది.

వర్క్‌షాప్ చివరి సెషన్‌లో బహుళ రాష్ట్రాల సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల గురించి రాష్ట్రాలకు సీఆర్‌సీఎస్ వివరించింది. మెరుగైన సమన్వయం కోసం రాష్ట్రాల సహాయం చేయాలని కోరింది.

వర్క్‌షాప్ ముగింపు సందర్భంగా సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి మాట్లాడారు. వర్క్‌షాప్‌లో చేపట్టిన నిర్మాణాత్మక చర్చలను ఆయన ప్రశంసించారు. గ్రామీణాభివృద్ధి, ఆత్మనిర్భరత, డిజిటల్ పరివర్తనకు ఉత్ప్రేరకంగా పీఏసీఎస్, బహుళ రాష్ట్రాల సహకార సంస్థల పాత్రను చెప్పారు. సహకార సంస్థలను ప్రభావవంతంగా నిర్వహించటం కోసం కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సహకారాన్ని పెంచడం, డిజిటల్ సాధనాలు- డేటా ఆధారిత పరిశీలనలను ఉపయోగించటానికి ఉన్న ప్రాముఖ్యతను ఆయన ప్రధానంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి 'సంస్కరణ, పనితీరు, పరివర్తన, ఇతరులతో పంచుకోవటం' అనే ఇతివృత్తం ఆధారంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా సహకార వ్యవస్థ సమానంగా అభివృద్ధి చెందేలా చూసుకునేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు డేటాను జాతీయ సహకార డేటాబేస్‌తో (ఎన్‌సీడీ) పంచుకోవాలని ఆయన కోరారు. సహకార బ్యాంకింగ్‌కు సంబంధించిన సమస్యను పరిష్కరించడానికి మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని కూడా ఆయన తెలిపారు. దీనికోసం ఆదాయ అవకాశాలను పెంచటం, స్థానిక వ్యవస్థాపకతను బలోపేతం చేయటానికి సహకార వ్యాపారాల వైవిధ్యీకరణను ప్రోత్సహించటంపై పని చేస్తున్నట్లు చెప్పారు. పథకాలను సకాలంలో అమలు చేయటం, ఆర్థిక కార్యకలాపాలలో పారదర్శకత, సహకార వనరులు సుస్థిరంగా నిర్వహించేలా చూసుకునే అవసరాన్ని ఆయన పేర్కొన్నారు. తిరుపతిలో వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, సహకార విభాగాలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన.. ప్రసంగాన్ని ముగించారు. సంయుక్త కార్యదర్శి శ్రీ రామన్ కుమార్ ధన్యవాదాలతో సెషన్ ముగిసింది. క్రియాశీలకంగా వ్యవహరిస్తూ విలువైన సహకారాన్ని అందించిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, వివిధ భాగస్వాములను ఆయన అభినందించారు.

# రూ. 25 లక్షల చొప్పున సబ్సిడీతో 1,000 ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు - శ్రీ చౌహాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:2025 అక్టోబర్ 11న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించనున్న ప్రతిష్ఠాత్మక పథకాల గురించి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు న్యూఢిల్లీలో ఒక ముఖ్యమైన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. భారతదేశం రబీ సాగు సీజన్‌లోకి ప్రవేశిస్తున్నందున, రైతుల సంక్షేమానికి, ఆదాయ వృద్ధికి ఉద్దేశించిన ప్రాధాన్యతా కార్యక్రమాలను ప్రధానమంత్రి ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారత వ్యవసాయ రంగం అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని, ప్రపంచానికి ఆహార భాండాగారంగా మారే దిశగా పయనిస్తోందని శ్రీ చౌహాన్ అన్నారు. దేశ అభివృద్ధి ప్రయాణం కొత్త శిఖరాలకు చేరుకుందని, ఇప్పుడు భారతదేశ పురోగతిని గత ప్రభుత్వాలతో పోల్చకుండా ప్రపంచ ప్రమాణాలతో కొలుస్తారని కేంద్ర మంత్రి అన్నారు.

ఆహార భద్రత కల్పించడం, రైతుల ఆదాయాలను పెంచడం, పౌష్టికాహార ధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలుగా ఉన్నాయని శ్రీ చౌహాన్ అన్నారు. 2014 నుంచి, భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 40% పెరిగింది, గోధుమ, బియ్యం, మొక్కజొన్న, వేరుశనగ, సోయాబీన్‌లలో రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చాయి. "ఈరోజు, భారతదేశం గోధుమ, బియ్యం విషయంలో పూర్తిగా స్వయం సమృద్ధి సాధించింది, నాలుగు కోట్ల టన్నులకు పైగా వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేశాం. అయితే, పప్పుధాన్యాల విషయంలో మనం సాధించాల్సింది ఇంకా ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

పప్పుధాన్యాలలో స్వావలంబన సాధించవలసిన అవసరాన్ని ప్రస్తావిస్తూ, మన దేశం పప్పుధాన్యాల అతిపెద్ద ఉత్పత్తిదారు, వినియోగదారు అయినప్పటికీ, ఇంకా అతిపెద్ద దిగుమతిదారుగా కొనసాగుతోందని శ్రీ చౌహాన్ అన్నారు. అందువల్ల, ఉత్పత్తి, ఉత్పాదకత, సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి ప్రభుత్వం పప్పుధాన్యాల స్వావలంబన మిషన్‌ను ప్రారంభించిందని, 2030-31 నాటికి మొత్తం పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని 27.5 మిలియన్ హెక్టార్ల నుంచి 31 మిలియన్ హెక్టార్లకు విస్తరించడం, ఉత్పత్తిని 24.2 మిలియన్ టన్నుల నుంచి 35 మిలియన్ టన్నులకు, ఉత్పాదకతను హెక్టారుకు 880 కిలోల నుంచి 1,130 కిలోలకు పెంచడం ఈ మిషన్ లక్ష్యమని ఆయన వివరించారు.

ఈ లక్ష్యాలను సాధించడానికి బలమైన పరిశోధన, అభివృద్ధి వ్యూహాన్ని సిద్ధం చేసినట్లు కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో భాగంగా తెగుళ్లను నిరోధించి, వాతావరణ ప్రతికూలతలను తట్టుకుని, అధిక దిగుబడినిచ్చే రకాలను అభివృద్ధి చేయడం, వాటిని రైతులకు సకాలంలో అందించడంపై దృష్టి పెడతారు. మినీ కిట్ల ద్వారా అధిక నాణ్యత గల విత్తనాలను పంపిణీ చేస్తారు. రైతులకు 1.26 కోట్ల క్వింటాళ్ల సర్టిఫైడ్ విత్తనాలు, 88 లక్షల ఉచిత విత్తన కిట్లను అందిస్తారు.

పప్పుధాన్యాలు పండించే ప్రాంతాల్లో రైతులకు మంచి ధరలు లభించేలా, స్థానిక విలువ జోడింపును ప్రోత్సహించేందుకు 1,000 ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు శ్రీ చౌహాన్ ప్రకటించారు. ప్రతి యూనిట్‌కు ప్రభుత్వం రూ. 25 లక్షల సబ్సిడీని అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మొత్తం వ్యవసాయ యంత్రాంగం 'ఒకే దేశం, ఒకే వ్యవసాయం, ఒకే జట్టు' అనే దార్శనికతతో పనిచేస్తుంది.

పీఎం ధన-ధాన్య యోజన గురించి మాట్లాడుతూ, వ్యవసాయ ఉత్పాదకత రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలోని జిల్లాల మధ్య కూడా మారుతూ ఉంటుందని శ్రీ చౌహాన్ అన్నారు. ఈ అసమానతను పరిష్కరించడానికి, ప్రభుత్వం తక్కువ ఉత్పాదకత ఉన్న 100 జిల్లాలను గుర్తించి, ఉత్పాదకతను పెంచడానికి లక్ష్య ఆధారిత చర్యలను అమలు చేస్తుంది. నీటిపారుదల సౌకర్యాన్ని మెరుగుపరచడం, నిల్వ సౌకర్యాలను బలోపేతం చేయడం, రుణ సదుపాయాన్ని విస్తరించడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడంపై ఈ ప్రయత్నాలు దృష్టి సారిస్తాయి.

ఈ కార్యక్రమానికి ఆకాంక్ష జిల్లాల నమూనా స్ఫూర్తి అని, దీనిని డాష్‌బోర్డ్ ద్వారా నీతి ఆయోగ్ పర్యవేక్షిస్తుందని ఆయన చెప్పారు. "తక్కువ పనితీరు కనబరుస్తున్న జిల్లాల ఉత్పాదకతను జాతీయ సగటుకు పెంచితే మొత్తం జాతీయ ఉత్పత్తి పెరుగుతుంది. రైతుల ఆదాయాలు పెరుగుతాయి. దేశ ఆహార అవసరాలు భద్రంగా ఉంటాయి" అని ఆయన పేర్కొన్నారు.

అక్టోబర్ 11న లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ జయంతి రోజున ఈ పథకం ప్రారంభం కానుండటం పట్ల శ్రీ చౌహాన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో దేశం సాధించిన ప్రధాన విజయాలను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావిస్తారని చెప్పారు.

వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ దేవేష్ చతుర్వేది, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డీఏఆర్ఈ కార్యదర్శి డాక్టర్ మాంగీలాల్ జాట్ కూడా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

భారతదేశ వ్యవసాయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ, రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అక్టోబర్ 11, 2025న, న్యూఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చరల్ సైన్స్ కాంప్లెక్స్, పూసాలో రెండు ప్రధాన కార్యక్రమాలు - పీఎం ధన-ధాన్య కృషి యోజన, పప్పుధాన్యాల లో స్వావలంబన మిషన్ - లను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ప్రారంభిస్తారు. పశుసంవర్ధక, మత్స్య, ఆహార శుద్ధి రంగాలకు సంబంధించిన రూ. 42,000 కోట్లు పైగా విలువైన 1,100కు పైగా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఇవి దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతుల జీవితాల్లో శ్రేయస్సు, సౌభాగ్యంతో కూడిన కొత్త శకాన్ని తీసుకువస్తాయని భావిస్తున్నారు.

ఈ కార్యక్రమం సందర్భంగా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, వ్యవసాయ రంగానికి అత్యుత్తమ సేవలు అందించిన రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు), సహకార సంఘాలు, ఆవిష్కర్తలను సత్కరిస్తారు. వ్యవసాయం గ్రామీణాభివృద్ధిలో సాధించిన క్రింద పేర్కొన్న అనేక కీలక జాతీయ విజయాలను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావిస్తారు,

వార్షిక వ్యాపారం కోటి రూపాయలు మించిన 1,100 'కోటిపతి ఎఫ్‌పీఓ' లతో సహా 10,000 ఎఫ్‌పీఓలతో 50 లక్షలమందికి పైగా రైతులు అనుసంధానమయ్యారు,

జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద సేంద్రీయ వ్యవసాయం కోసం లక్షమందికి పైగా రైతులు ఎంపికయ్యారు.

10,000 కొత్త ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) ను ఇ-పీఏసీఎస్ లుగా కంప్యూటరీకరించడం, వాటిని కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్సీ), ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు (పీఎంకేఎస్కే), ఎరువుల రిటైల్ అవుట్‌లెట్‌లుగా మార్చడం.

10,000 ప్రాంతాలలో పాడి, మత్స్య సహకార సంఘాల కోసం కొత్త బహుళ ప్రయోజన పీఏసీఎస్ ల ఏర్పాటు.

దేశవ్యాప్తంగా 4,275 గ్రామీణ మల్టీపర్పస్ ఏఐ టెక్నీషియన్లకు (ఎంఏఐటీఆర్ఐ) సర్టిఫికేషన్.

పీఎం ధన - ధాన్య కృషి యోజన కింద, దేశవ్యాప్తంగా 100 తక్కువ ఉత్పాదకత కలిగిన జిల్లాలలో రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో సమగ్ర వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాన్ని చేపడతారు. ఈ పథకం ప్రతి పొలానికి నీటిపారుదల సౌకర్యాలను కల్పించడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం, రుణ, నిల్వ సౌకర్యాలను సులభంగా పొందేలా చూడటం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ ప్రభుత్వ పథకాలను కలపడం ద్వారా ఈ కార్యక్రమం రైతులకు ప్రత్యక్ష ప్రయోజనాలను అందించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గట్టి ఊతాన్ని ఇస్తుంది.

పప్పుధాన్యాలలో స్వయంసమృద్ధి మిషన్ కంది, మినుములు, ఎర్రపప్పు వంటి ప్రధాన పప్పుధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించడంపై దృష్టి పెడుతుంది. ఈ మిషన్ కింద నమోదైన రైతుల నుంచి కేంద్ర ఏజెన్సీలు వారి ఉత్పత్తి మొత్తాన్ని కనీస మద్దతు ధరకు (ఎంఎస్పీ) కొనుగోలు చేస్తాయి. తద్వారా సాగుదారులకు మంచి రాబడి లభిస్తుంది. పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఒక కీలకమైన కార్యక్రమంగా సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి, ఉత్పాదకతను మెరుగుపరచడానికి ఈ మిషన్ దోహదపడుతుంది.

మొత్తంమీద ఈ కార్యక్రమాలు రాబోయే సంవత్సరాల్లో భారతదేశ ఆహార భద్రతను పటిష్ఠం చేయడమే కాకుండా, పప్పుధాన్యాల ఉత్పత్తిలో దేశాన్ని స్వయం సమృద్ధి వైపు నడిపిస్తాయి. రైతుల సాధికారత, సుస్థిర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను నిర్మించడం పట్ల ప్రభుత్వ నిబద్ధతను మరింత బలపరుస్తాయి.


పి వి ఎం ఫౌండేషన్
సర్వార్ధ సంక్షేమ సమితి
హైదరాబాద్
ఆహ్వానము
శ్రీ పివి మనోహర్ రావు గారు రచించిన
ఈనాటి ధ్యేయాలు - ఆనాటి గేయాలు
గ్రంథావిష్కరణోత్సవం
తేదీ: 12.10.2025, ఆదివారం సాయంత్రం 5 గం. 30ని.లకు
వేదిక: రవీంద్ర భారతి- సమావేశ మందిరము 1వ అంతస్తు హైదరాబాద్
గాన,నాట్య విభావరి: 5:30 - 6:30 సాయంత్రం
శ్రీమతి స్వేత, చి॥ వేద తదితరులు
ముఖ్య అతిధి :డాక్టర్ కె.వి.రమణా చారి గారు
ఐఏఎస్ రిటైర్డ్ తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు
సభాధ్యక్షులు :ఆచార్య వెల్దండ నిత్యానంద రావు గారు
ఉపాధ్యక్షులు, సురవరం ప్రతాపరెడ్డి తె.వి.వి
ఆత్మీయ అతిథులు :శ్రీమతి సురభి వాణి దేవి గారు
శాసనమండలి సభ్యులు
శ్రీ పి.వి ప్రభాకర్ రావు గారు
అధ్యక్షులు గ్లోబల్ పీవీ మెమోరియల్ ట్రస్ట్
శ్రీ బి శ్రీనివాస్ రావు
రిటైర్డ్ లెక్చరర్
గౌరవ అతిథులు :ఆచార్య పి గౌరీ శంకర్ గారు
పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
డా.బి.జయ రాములు గారు
పూర్వప్రిన్సిపాల్ టీఎస్ ఓరియంటల్ ఫ్యాకల్టీ,ఓయు
శ్రీ నందూరి బంగారయ్య శర్మగారు
ఆధ్యాత్మికవేత్త
సహకారం : శ్రీ ఉమ్మడి సింగ్ రాఘవరావు గారు(రఘు శ్రీ)
వ్యవస్థాపక కార్యదర్శి మానస ఆర్ట్ థియేటర్స్
స్వాగతం : శ్రీ పి.వి మదన్‌మోహన్ గారు
సర్వార్థ సంక్షేమ సమితి
వ్యాఖ్యానం : శ్రీ పి మోహన్ కృష్ణ గాంధి గారు
(ప్రముఖ వ్యాఖ్యాత)
వందన సమర్పణ : రఘు శ్రీ
పి.వి. మదన్ మోహన్
పీవి రాజమోహన్ (కిరణ్)
సర్వార్ధ సంక్షేమ సమితి, హైదరాబాద్


# భారీగా మోహరించిన పోలీసులు

మంచిర్యాల,అక్టోబర్ 11: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడంతో మనస్థాపంతో నిన్న ఆత్మహత్య చేసుకున్న యేట మధుకర్ మృతదేహానికి ఎట్టకేలకు పోస్టుమార్టం పూర్తయింది. నిన్న నీల్వాయి అడవుల్లో మధుకర్ చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణం చెందారు. ఈ సమాచారం అందుకున్న ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. రాత్రంతా అడవుల్లోనే మృతదేహంతో వారు ఆందోళన చేశారు.

మృతుడు కుటుంబ సభ్యులను, గ్రామస్థులను పోలీసులు, అధికారులు ఒప్పించి మృతదేహాన్ని ఈ రోజు ఉదయాన చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంత్యక్రియలకు ఏర్పాట్లు ప్రారంభించారు. ముందు జాగ్రత్తగా పోలీసు ఉన్నత అధికారులు భారీగా బలగాలని ఇక్కడ మోహరించారు. మృతుడు మధుకర్ కు తల్లిదండ్రులు భీమయ్య, రాజక్కభార్య స్వరూప, కుమారుడు రవి, కుమార్తె మౌనిక ఉన్నారు. ఆయన అకాల మరణంతో కుటుంబ సభ్యులు ఆవేదనలో మునిగిపోయారు.

పార్టీ నాయకుడు అకాల మృతికి బీజేపీ అగ్ర నాయకులు స్పందించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రావు సహా మంచిర్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, బెల్లంపల్లి పార్టీ ఇంచార్జీ కొయ్యల ఏమాజీ నీల్వాయికి చేరుకున్నారు.అదేవిధంగా పార్టీ పెద్దపల్లి మాజీ పార్లమెంటు సభ్యులు వెంకటేష్‌నేత, పార్లమెంటు నియోజక వర్గ నేత గొమాస శ్రీనివాస్, చెన్నూరు నాయకులు దుర్గం అశోక్ తదితరులు నిల్వాయికి చేరుకొని మధుకర్ మృతదేహానికి నివాళులర్పించారు. స్పష్టం చేశారు.

## ద్రవ్య పోర్టల్ మొదటి ఫేజ్ లో 100 ఆయుష్ ఔషధాల జాబితా

న్యూఢిల్లీ, అక్టోబర్ 11:ద్రవ్య పోర్టల్ మొదటి దశలో 100 కీలక ఔషధాల జాబితాను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ జాబితాకు సంబంధించిన కచ్చితత్వాన్ని, ప్రామాణికతను నిర్ధారించేందుకు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ద్వారా నిరంతరం డేటాను నవీకరిస్తారు.

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటైజ్డ్ రిట్రీవల్ అప్లికేషన్ ఫర్ వర్సటైల్ యార్డ్ స్టిక్ ఆఫ్ ఆయుష్ (ద్రవ్య) కార్యక్రమం, ఒక వినూత్న ఆన్ లైన్ విజ్ఞాన నిధి.

ద్రవ్య పోర్టల్ ఏఐతో మాత్రమే కాక, ఆయుష్ గ్రిడ్, ఔషధ పదార్థాలు, ఔషధ విధానానికి సంబంధించి ఇతర కార్యక్రమాలతోనూ అనుసంధానం అవుతుంది. క్యూఆర్ కోడ్ అనుసంధానంతో దేశవ్యాప్తంగా ఉన్న ఔషధ మొక్కల ఉద్యానవనాలు, ఔషధ నిల్వ కేంద్రాల్లో ప్రామాణిక సమాచారాన్ని తెలుసుకునే వీలుంటుంది.

సంప్రదాయ వైద్యంలో ఆధారాలతో అనుసంధానం, డిజిటల్ పరివర్తనకు తొలి అంచెగా... గోవాలో జరిగిన 10వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 23న కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్ శ్రీ అశోక్ గజపతి రాజు, గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్, కేంద్ర ఆయుష్ సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్, కేంద్ర విద్యుత్, నూతన అండ్ పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద ఎస్సో నాయక్, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆయుష్ ఔషధాలకు సంబంధించి ప్రామా ణిక మైన, పరిశోధనాధారిత సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సాంకేతికతను ఉపయోగించుకోవాలనే మంత్రిత్వ శాఖ ప్రాధాన్యతను ఈ కార్యక్రమం తెలియజేస్తుంది.

సమగ్రమైన, అందరికీ అందుబాటులో ఉండే సమాచార కేంద్రం ద్రవ్య పోర్టల్. ఇది శాస్త్రీయ ఆయుర్వేద కేంద్రాలు, ప్రామాణిక ఆన్ లైన్ పరిశోధనా వేదికల నుంచి డేటాని తీసుకుని ఎప్పటికప్పుడు నవీకరిస్తుంది. స్పష్టమైన వినియోగదారు ఇంటర్‌ఫేస్‌తో రూపొందించిన ఈ పోర్టల్ ద్వారా ఆయుష్ వ్యవస్థల్లో ఉపయోగించే ఔషధాల కోసం అన్వేషించేందుకు, ఆయుర్వేద ఫార్మకోథెరపోటిక్స్, వృక్షశాస్త్రం, రసాయన శాస్త్రం, ఫార్మసీ, ఫార్మకాలజీ, భద్రతా సమాచారానికి సంబంధించిన వివరణాత్మక ప్రొఫైళ్లను పొందవచ్చు.

# తెలంగాణ ఉద్యమకారుడు కొమ్ము కిషన్‌కు అండగా ఉంటాం : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



మెదక్, అక్టోబర్ 11: తెలంగాణ ఉద్యమ కారుడు ఘనపూర్‌కు చెందిన కొమ్ము కిషన్ కు అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి భరోసా ఇచ్చారు. గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ లక్ష్మక్క పల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిషన్ ను ఎమ్మెల్యే పరామర్శించారు .ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం గురించి చింతించ వద్దని సూచించారు. కిషన్ కు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సీఈవో శ్రీనివాసును ఆదేశించారు ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, నాయకులు దోమల కొమురయ్య , భోదనం కనకయ్య , కొమ్ము శరత్, రాజిరెడ్డి బాలరాజు, రాజశేఖర్ తదితరులు న్నారు

# ప్రత్యేకంగా అప్లికేషన్‌ను రూపొందించాం



నల్గొండ, అక్టోబర్ 11:కార్యకర్తలందరి నిర్ణయంతోనే నల్లగొండ డీసీసీ అధ్యక్షుడి నియామకం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ చెప్పారు. ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ బిస్వ రాజన్ మహంతో కలిసి ఈ రోజు నల్లగొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రాహుల్ గాంధీ ఆలోచన మేరకు కార్యకర్తల సమక్షంలోనే కార్యకర్తల అభిప్రాయాల మేరకు ప్రజాస్వామ్య విధంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుంని చెప్పారు. డీసీసీఅధ్యక్షుడి నియామకం కోసం ప్రత్యేకంగా అప్లికేషన్‌ను రూపొందించామని డీసీసీ పదవి కోరుకునే ప్రతి కార్యకర్త అప్లికేషన్‌ను పూర్తి చేసి అందించవచ్చని చెప్పారు.

బీఆర్ఎస్ పార్టీలో పార్టీ అధ్యక్షుల ఎన్నిక కేసీఆర్‌వంటింట్లో కూర్చొని ఎంపిక చేస్తారని, జాతీయ పార్టీ అని చెప్పుకునే బీజేపీలో నరేంద్ర మోడీ, అమిత్ షాలను ప్రసన్నం చేసుకుంటేనే పదవులు వస్తాయని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా పార్టీ పదవులను భర్తీ చేసే సాంప్రదాయం ఒక కాంగ్రెస్ పార్టీలోనే ఉందన్నారు. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌పార్టీ అధ్యక్షుడి నియామకానికి సంబంధించి షెడ్యూల్ విడుదల చేస్తారన్నారు. పార్టీ పటిష్టత కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ తగిన గుర్తింపునిస్తుందని సంపత్ హామీ ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

